క్లుప్తంగా

సీహెచ్‌పీలో రక్షణ బృందం పర్యటన


రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో రక్షణ బృందం సభ్యులు గురువారం ఇల్లెందు సీహెచ్‌పీలో పర్యటించారు. ఈనెల 19 నుంచి 21 వరకు 55వ వార్షిక రక్షణ భద్రత పక్షోత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, రక్షణ బృందం చీఫ్ గెస్ట్ దిలీప్‌కుమార్, డీడీఎంఎస్ కన్వీనర్ తిరుమల రావు, ఎస్‌ఓటూజీఎం బి.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ ఆర్‌వీ నరసింహరాజు, రాజు, క్రిష్టఫర్, డాక్టర్ మల్లారెడ్డి, మహేంద్ర నాథ్, హనుమాన్, గుర్తింపు సంఘం నజీర్ అహ్మద్ మహబూబ్, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రాతపరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాతపరీక్ష లేకుండా కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు సర్వీసులో ఉన్న ఏఎన్‌ఎంలకు వయోపరిమితి ఎత్తివేయాలని, పెరిగిన జనాభా ప్రాతిపదికన సబ్ సెంటర్లను పెంచాలని, ఎన్‌హెచ్‌ఎం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఏఎన్‌ఎంలను రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని, 20 సంవత్సరాలు సర్వీసును పూర్తి చేసుకున్న తమకు ఇప్పుడు రాత పరీక్ష నిర్వహించడం అన్యాయమని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ, ప్రియాంక, పార్వతి, పద్మజ, కౌసల్య, జ్యోతి, వెంకటరమణ, విజయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

మాలమహానాడు నాయకుల అరెస్ట్

పాల్వంచ: చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా గురువారం పోలీసులు మాలమహానాడు సంఘం నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పట్టణ ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో మాలమహానాడు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమల్ల సుందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, జిల్లా కోకన్వీనర్ దారా చిరంజీవిలను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

సమ్మె నోటీసు అందజేత

ఇల్లెందు: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయ సంఘం (టీడబ్ల్యూసీఆర్‌టీయూ టీజీ) గురువారం ఇల్లెందు ఏటీడీఓ రాధమ్మకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ నెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు ఐటీడీఏ భద్రాచలం ఎదుట 48 గంటల పాటు సమ్మె చేయనున్నట్లు తెలిపారు. 20 ఏళ్లుగా పలు ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్‌టీలుగా పని చేస్తున్నామని, సర్వీసు రెగ్యులరైజ్ చేయాలని, విధుల సమయాన్ని అమలు చేయాలని, 61 సంవత్సరాలు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతీనెల గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డు సదుపాయం కల్పించటం, మరణించిన ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ కింద రూ.పది లక్షలు అందజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రవికుమార్, కమల, శ్రీదేవి, నిర్మల, శైలజ, రమ్య, కుసుమ, సుజాత, హరిరామ్, రాందాస్, రమేష్, భద్రయ్య, సురేష్, దేవ్‌సింగ్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

సుజాతనగర్: సుజాతనగర్ రైతు వేదికలో రబీ సీజన్‌కు వరి, పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారిణి గాంధ్ల నర్మద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి ఆర్‌ఎన్‌ఆర్ 15048, ఎంటీయూ 1010, పెసర విరాట్ రకాలకు చెందిన విత్తనాలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరపాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని, రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామికి సీపీఎం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ... మున్సిపాలిటీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని దళారులను నమ్మి ప్రజలు మోసపోకుండా అవినీతి అక్రమాలకు తావు లేకుండా అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. వార్డు సభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఏకపక్షంగా లబ్ధిదారుల ఎంపిక జరిగితే సహించబోమని తర్వాత జరిగే పరిణామాలకు మున్సిపల్ అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు.

అర్ధరాత్రి నుంచి వారిదే హవా..

- అక్రమార్కుల ఇసుక వ్యాపారం
- నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు, రవాణా
- తనిఖీలు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యం


రైతుబజార్ ఏరియాలో నిల్వచేసిన ఇసుక

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. అడ్డు చెప్పాల్సిన అధికారులే చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో దందాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లవుతోంది. ఫలితంగా వాగుల్లో ఇసుక మాయం అవుతోంది. రానున్న రోజుల్లో ఇసుక దొరకడం కష్టతరం అయ్యేంతగా తోడేసి అమ్మకాలు చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ అధికారులు ట్రెంచ్‌లు కొట్టించాల్సి ఉన్నా ఎక్కడా అలా జరగడం లేదు. ప్రధానంగా కొత్తగూడెం పట్టణ పరిధిలోని ముర్రేడు వాగు నుంచి, పెనుబల్లివాగు, గోధుమవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అర్ధరాత్రి 11 గంటల తరువాత ప్రారంభమై తెల్లవారుజాము వరకు అక్రమ రవాణా పట్టణంలో రణగొణ ధ్వనులతో నివాసప్రాంతాల మీదుగా చేస్తున్నారు. ట్రాక్టర్ శబ్దాలతో గాజులరాజంబస్తీ, కూలీలైన్ ఏరియా, రైతుబజార్ ఏరియా, విశ్వనాథకాలనీ, పాతకొత్తగూడెం, గాంధీనగర్, రామవరంలోని కొన్ని వార్డుల ప్రజలు రాత్రివేళ నిద్ర కోల్పోతున్నారు. నిద్రించే సమయంలో ఇళ్ల మధ్య నుంచి ట్రాక్టర్లు తిరుగుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఎవరు ఇబ్బంది పడినా అక్రమ సంపాదనే ధ్యేయంగా ఇసుక రవాణాను నిలిపే ప్రసక్తే లేదంటూ అక్రమార్కులు తమ పని కానిచ్చేస్తున్నారు. రాత్రివేళ జనావాసాల మీదుగా ట్రాక్టర్లతో రవాణా ఏంటీ..? అని ప్రశ్నిస్తే వారిపై దాడులకు తెగబడుతున్నారు.

తనిఖీల మాటెత్తని యంత్రాంగం..

కొత్తగూడెం పట్టణ పరిధిలోని ముర్రేడువాగు, పెనుబల్లివాగు, గోధుమవాగు నుంచి అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్నా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు సాధారణ విధుల సమయంలో తనిఖీలు చేపట్టడం లేదు కనుక, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు బాధ్యతగా అధికారులు ఏదైనా ఓరోజు రాత్రి సమయంలో తనిఖీలు చేస్తే మూడు వాగుల నుంచి దాదాపు 50 ట్రాక్టర్లు, మరో 50 ఎడ్లబండ్లు దొరికే అవకాశం ఉంటుంది. వాటిని సీజ్ చేసి జరిమానాలు విధిస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే వస్తుంది. ఇవేవి జరగకపోవడంతో అక్రమ ఇసుక రవాణాకు అనుమతులు ఇచ్చినట్లు ఎటువంటి భయం లేకుండా రవాణా చేస్తూ పట్టణ ప్రజలను అవస్థలకు గురిచేస్తున్నారు.

పలు చోట్ల డంప్‌లు..

అక్రమ ఇసుక రవాణా చేసే వ్యాపారులు ఇంకో అడుగు ముందుకేసి, వాగుల్లో తోడిన ఇసుకను పట్టణంలోని పలు ప్రాంతాలను ఎంపిక చేసుకొని డంపింగ్ చేస్తున్నారు. వారికి ఆర్డర్లు వచ్చినప్పుడు, అవసరం వచ్చినప్పుడు వాగులోకి వెళ్లే అవసరము లేకుండా డంపింగ్ ప్రాంతాలకు వెళ్లి అనధికారిక ఇసుకను అధికారికంగా అమ్ముకుంటున్నారు. ఇసుక డంపింగ్‌లు రైతుబజార్ ఏరియాలోని పలు చోట్ల ఉన్నాయి. వాటిని కూడా అధికారులు తనిఖీలు చేసి పట్టుకోవడం లేదంటే పలు అనుమానాలకు తావు ఇచ్చినట్లు అవుతోంది. అయితే స్థానికవాగుల నుంచి తోడిన ఇసుకను అభివృద్ధి నిర్మాణాలకు వినియోగించవద్దు. కానీ అభివృద్ధి నిర్మాణాలు... రోడ్లు, డ్రెయినేజీలు, వాటర్ ట్యాంకులు, ఇతర నిర్మాణాలన్నింటికీ వాగుల నుంచి తీసిన ఇసుకనే వాడుతున్నారు. దీనివలన నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తోంది. మున్సిపాలిటీలు, మండలాల్లో ప్రభుత్వ అభివృద్ధి పనులకు నాణ్యత కలిగిన గోదావరి ఇసుకను వినియోగించాలనే నిబంధనలు ఉన్నాయి, కానీ నిబంధనలను తుంగలో తొక్కి వాగు ఇసుకతో నిర్మాణాలు చేస్తున్నారు.

తనిఖీలు చేపడతాం...

కొత్తగూడెం పట్టణ పరిధి ముర్రేడువాగు, గోధుమ వాగు, పెనుబల్లి వాగుల నుంచి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. ఈ విషయంలో పోలీసు వారితో కలిసి సంయుక్తంగా తనిఖీలు చేపడతాం. అర్ధరాత్రి వేళ ఎక్కువగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు తెలిసింది. ఇకపై పగటి వేళల్లోనే కాక రాత్రి కూడా నిఘా ఏర్పాటు చేస్తాం.

– పుల్లయ్య, తహసీల్దార్, కొత్తగూడెం

మహిళలకు ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో సింగరేణి డే సందర్భంగా మహిళలకు ముగ్గులు, దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. గురువారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోటీలలో సేవా అధ్యక్షురాలు వీసం రమ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. మహిళలు రోజువారీ పని ఒత్తిడి నుంచి అలసట తీరేందుకు, మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీలలో విజేతలకు డిసెంబర్ 23న నిర్వహించే సింగరేణి డే దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, సేవా సమితి సెక్రెటరీ ఎల్.సులక్షణ, ట్రైనర్స్ పాల్గొన్నారు.

డిమాండ్స్ డే పాటించాలి


నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో సుమారు 30 వేల మంది కార్మికుల సమస్యల సాధన కోసం ఈనెల 19, 20, 21 తేదీలను డిమాండ్స్ డేలుగా పాటించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర నాయకులు ఎస్.సంజీవ్, రీజియన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని కాంట్రాక్ట్ కార్మికుల అడ్డాలో ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంపై, వారిని పర్మనెంట్ చేసేందుకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని పాలకులు హామీలు ఇస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరిస్తున్నారని ఇది పాలకులకు తగదని, కనీసం ఈ ప్రభుత్వమైన తీర్మానం చేస్తే కార్మికులకు భరోసా కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెక్కలు ముక్కలు చేసుకొని సంస్థకు రూ.కోట్ల లాభాలు తెచ్చిపెడుతున్న కార్మికులను పాలకులు, ప్రభుత్వం, యాజమాన్యం విస్మరించటం సరైంది కాదన్నారు. కృష్ణ, మణెమ్మ, శారద, కృష్ణవేణి, లక్ష్మి, వెంకటమ్మ, శంకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలపై సింగరేణి వేడుకల్లో నిరసన


ప్రచారం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంపై ఈనెల 23న సింగరేణి డే ఉత్సవాల్లో సీఎండీ, ప్రభుత్వం ప్రకటన చేయకపోతే, నిండు సభలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ కార్మికులు వెట్టి చాకిరీ చేస్తూ సింగరేణి లాభాల్లో భాగస్వాములైన కాంట్రాక్ట్ కార్మికుల పట్ల ప్రభుత్వం, యాజమాన్యం సవతి తల్లి ప్రేమను కనబరుస్తోందని, వారికి జీతాలు పెంచకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. వెంటనే జీఓ నంబర్ 22 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోలిండియాలో వేతనం రోజుకు రూ.1200 ఇస్తుండగా, సింగరేణిలో రూ.500 మాత్రమే చెల్లిస్తూ వారి శ్రమను దోచుకుంటోందని ఆరోపించారు.

కేటీఆర్‌పై కేసు నమోదు గర్హనీయం


మాజీ మంత్రి వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): గత ఎన్నికలలో అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకపోవడంతో ప్రజలలో వస్తున్న ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని దీనిలో భాగంగానే బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ కేటీఆర్‌పై అక్రమ కేసు బనాయించారని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆటవికపాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీ అమలు చేయలేక ప్రతిపక్ష పార్టీల నేతలపై తప్పుడు కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజలలో కేటీఆర్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారంతో ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని, విజ్ఞులైన తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని వచ్చే ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కేటీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలపై పెట్టిన తప్పుడు కేసులను విరమించుకుని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యవాదులు ఇలాంటి అప్రజాస్వామిక విధానాలను ఖండించాలని కోరారు.

కోదండరామ్‌కు కృతజ్ఞతలు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులపై స్పందించిన ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్‌ను టీయూసీఐ నాయకులు హైదరాబాద్‌లో కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై గురువారం శాసనమండలిలో మాట్లాడారు. ఈ మేరకు కోదండరామ్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. రెండు రోజుల నుంచి సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు అసెంబ్లీలో చర్చించారని, వీరందరికీ పేరుపేరునా ధన్యావాదాలు తెలిపారు. ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఎస్సైకి ప్రశంసాపత్రం


ఎస్పీ రోహిత్‌రాజు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై రమాదేవి

సుజాతనగర్: సుజాతనగర్ ఎస్సై ఎం.రమాదేవి ఉత్తమ పోలీస్ సేవా ప్రశంసాపత్రాన్ని ఎస్పీ రోహిత్‌రాజు చేతుల మీదుగా గురువారం అందుకున్నారు. ఈ నెల 14న జరిగిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పాత కేసులలో ఇరువర్గాలు రాజీ పడి కోర్టులో కేసులను పరిష్కరించుకోవడంలో జిల్లాలోనే ఆమె ఉత్తమ పనితీరు కనపర్చారు. పాత కేసులను రాజీ చేయడం, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పరిష్కరించడంతో ప్రశంసాపత్రానికి ఎంపికయ్యారు.

అధికారులపై చర్యలు తీసుకోండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో రక్షణ చర్యలు విస్మరిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 గనిలోని మొదటి షిఫ్ట్‌లో డంపర్ నెంబర్ 10759 డంపర్ వద్ద అధికారుల అత్యుత్సాహం కారణమని, రక్షణ చర్యలు అమలు చేయకపోవటం వలన డంపర్ ఆపరేటర్ మూస్ చందా మృతి చెందినట్లు చెప్పారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యలను పక్కన పెట్టి, పైరవీల మత్తులో, బోర్డ్ మెడికల్ కేసుల్లో లీనమయ్యారని ఆరోపించారు. ఈ రెండు సంఘాల ద్వంద్వ వైఖరి కారణంగా అధికారులు కార్మికుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని ఆరోపించారు. డంపింగ్ యార్డ్‌కు సంబంధించిన రక్షణ చర్యలు పాటించని కారణంగా ఈ ప్రమాదం జరిగిందని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ టీఎస్ పవన్ కుమార్, మొగిలిపాక రవి పాల్గొన్నారు.

24న బీసీ ఐక్యవేదిక ప్రారంభం


బీసీ ఐక్యవేదిక నాయకులు

చుంచుపల్లి: ప్రజాస్వామ్యంలో మెజారిటీ ప్రజలకే రాజ్యాధికారం ఉండాలని దానితోనే అన్ని సమస్యలకు పరిష్కార మార్గం దొరుకుతుందని బీసీ కులాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. గురువారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ... జిల్లా కేంద్రం కొత్తగూడెంలో బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా కార్యాలయాన్ని ఈనెల 24న ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం ఉన్న బీసీలు 80 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో అభివృద్ధికి, రాజకీయ అధికారానికి ఆమడ దూరంలోనే ఉన్నారన్నారు. ఈ మధ్య జరుగుతున్న పరిణామాలను గుర్తించిన బీసీ నాయకులు, మేధావులు రాష్ట్రవ్యాప్తంగా బీసీలను చైతన్యం చేసేందుకు వివిధ రకాల కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారని చెప్పారు. నూతన కార్యాలయ ప్రారంభానికి అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవుల ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి, సీనియర్ జర్నలిస్టు సంగెం సూర్యారావు, తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్లెల రామనాథం హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ ఐక్యవేదిక నాయకులు బొడ్డుపెల్లి సత్యనారాయణ, మిట్టపల్లి సాంబయ్య, చిటికెన మునలయ్య, కురిమెళ్ల శంకర్, కాసోజు రామాచారి, పల్లపు లక్ష్మణ్, తాళ్లూరి సత్యనారాయణ, ఉబ్బనపల్లి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవలోనే ఆనందం దొరుకుతుంది..


విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వాహకులు

కొత్తగూడెంఅర్బన్: సాటి మనిషికి సేవలోనే సుఖసంతోషాలు దాగి ఉన్నాయని చుంచుపల్లి మండలం విద్యాశాఖ అధికారి బానోత్ బాలాజీ అన్నారు. రుద్రంపూర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అదనపు తరగతులకు గానూ జమాతే ఇస్లామి హింద్ శాఖ ఆధ్వర్యంలో నెల రోజులకు సరిపడా అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనేక సంవత్సరాలుగా జమాతే ఇస్లామి హింద్ ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు అనేక రకాలుగా సేవ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ... మానవాళి మార్గదర్శి మానవ జీవిత మర్మాన్ని తెలిపే ఖురాన్ అవతరణ ఇక్రా చదువుతో ప్రారంభం అయిందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా జ్ఞానాన్ని ఆర్జించడం మానకూడదని ప్రవక్త ముహమ్మద్ బోధించారని తెలిపారు. అందుకే కులమతాలకు అతీతంగా విద్యాభివృద్ధికి జమాత్ కృషి చేస్తుంన్నారు. ఈ కార్యక్రమంలో జమాత్ సభ్యులు ముమ్మద్ షమీం, రబ్బానీ, మోలార్, ఉపాధ్యాయులు గణేష్, లక్ష్మి, రాధ, వెంకటేశ్వరరావు, ఇంద్రా దేవి, దీరజ్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ జేఏసీ పిలుపులో భాగంగా గురువారం పంచాయతీ కార్మికులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి, ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరారు. కార్మికుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి నర్సింహారావు, సామేలు, మోహన్‌రావు, తిరుపతి, రమేష్, చిట్టిబాబు, విజయ్‌కుమార్, రాధాకృష్ణ, శ్రీకాంత్, సర్వేష్, ప్రవీణ్, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యేసు చూపిన మార్గంలో పయనించాలి

పాల్వంచరూరల్: యేసుక్రీస్తు చూపిన మార్గం సర్వ మానవాళికి ఆదర్శం.. ఆయన చూపిన మార్గంలో పయనించాలని వక్తలు శాంసన్ జడ్సన్ దశ అన్నారు. స్థానిక కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి మైదానంలో గురువారం జెన్‌కో కేటీపీఎస్ ఎంప్లాయిస్ యునైటెడ్ క్రిస్మస్ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ సీఈ వెంకటేశ్వరరావు, జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాస్‌బాబు, ఎస్‌ఈలు గుర్రం రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, యుగపతి, మోక్షవీర్, ఎస్‌పీఎఫ్ కమాండెంట్ చంద్రభాస్కర్, విజిలెన్స్ డీఎస్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులతో సమీక్ష సమావేశం


సమావేశానికి హాజరైన వ్యాపారులు

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో క్రయ విక్రయాలు నిర్వహించాలని తీర్మానించారు. గురువారం ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టణంలోని పలువురు వ్యాపారులు హాజరయ్యారు. 55 మంది లైసెన్సుదారులు ఉండగా కేవలం 20 మంది లోపు వ్యాపారులు హాజరై మార్కెట్ లోనే తాము కొనుగోళ్లు చేస్తామని, గ్రామాల్లో చిరు వ్యాపారులను కట్టడి చేయాలని కోరారు. అనుమతి ఉన్న ప్రతీ వ్యాపారి మార్కెట్‌కు వచ్చేలా చూడాలని వ్యాపారులు కోరగా.. ముందు వ్యాపారులు మార్కెట్‌కు వస్తే గ్రామాల్లో కట్టడి సులభతరం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఇక మీదట ఏ గ్రామంలో అయినా క్రయ విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హమాలీలు హాజరై తాము కూడా మార్కెట్‌లో క్రయవిక్రయాలకు సహకరిస్తామని, బయట కాంటాలు పెట్టమని, మార్కెట్‌లోనే హమాలీ పనులు చేస్తామని హామీపత్రం అందజేశారు. ఈ సమావేశంలో సెక్రెటరీ నరేష్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన



కొత్తగూడెంఅర్బన్: నిరసన తెలుపుతున్న నాయకులు, జూలూరుపాడులో ..

కొత్తగూడెంఅర్బన్: అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని, అంబేద్కర్‌ను హేళన చేసిన అమిత్ షా క్షమాపణలు చెప్పాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ శ్రేణులతో కలిసి పోస్టాఫీసు అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పుణ్యమా అని నేడు కేంద్రమంత్రి స్థానంలో ఉన్న అమిత్ షా తన స్థాయి మరచి పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత భారతరత్న అంబేద్కర్‌ను హేళన చేస్తూ మాట్లాడిన మాటలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నేడు ప్రజాస్వామ్య విధానాలను అవహేళన చేస్తున్న బీజేపీ ప్రభుత్వం త్వరలోనే ప్రజాస్వామ్యం స్థానంలో మనువాదాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని, అదే జరిగితే 93 శాతం ప్రజలు గతంలో మాదిరిగా మళ్లీ బానిసలుగా మార్చే కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, మాలోత్ వీరునాయక్, వినయ్, జగదీష్, రాయరాకుల నర్సింగరావు, పగవాల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై జూలూరుపాడులో గురువారం బహుజన నాయకులు నిరసన తెలిపారు. చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాలు, మైనారిటీలు, పేదలకు డాక్టర్ అంబేద్కర్ మహాపురుషుడన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్, బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ జెర్రిపోతుల నరేష్, మాలమహానాడు మండల అధ్యక్షుడు బడుగు వీరస్వామి, దళిత సంఘ నాయకులు ఇడుపుల రాజు, గార్లపాటి వెంకటి, మాజీ సర్పంచ్ చింతా జగన్నాథం, రాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.